
క్లుప్తంగా

అపూర్వ సమ్మేళనం



సంగం జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

సంగం: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. పాఠశాలలో చదివిన 1994–99 బ్యాచ్ పూర్వ విద్యార్థులు అందరూ కలుసుకుని సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అందరూ విద్యార్థి దశలో తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. అనంతరం తమ గురువు టీవీ శేషయ్యను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాలకు బీరువాను బహూకరించారు.

గిరి ప్రదక్షిణకు సూపర్ లగ్జరీ బస్సు

ఆత్మకూరురూరల్: ఈ నెల 5న పౌర్ణమి సందర్భంగా ఆత్మకూరు డిపో నుంచి ఉదయం 8 గంటలకు అరుణాచలం గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేస్తుందని డిపో మేనేజరు కరిముల్నీసా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ కూడా కల్పించామని, అరుణాచలం వెళ్లే యాత్రికులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

4న నరసింహస్వామి జయంతి

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం జలాశయ ప్రాంగణంలోని సిద్ధేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన నరసింహస్వామి ఆలయంలో 4వ తేదీన నరసింహ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు ఎల్‌వీ ప్రసాద్‌శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష అభిషేకాలు, పూజలు, ప్రత్యేక అలంకరణలు జరుగుతాయన్నారు.

వైభవంగా వసంతోత్సవం



వసంతోత్సవంలో యువకులు, చిన్నారులు

మర్రిపాడు (ఆత్మకూరురూరల్): మండలంలోని డీసీపల్లి రామాలయం వద్ద శ్రీరామనవమి ఉత్సవాలు పురస్కరించుకుని ఆదివారం వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు. చిన్నారులు, యువకులు, మహిళలు ఆలయ ధర్మకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం సీతారాముల ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రికి నిర్వహించిన పారువేట కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ హేమలతారెడ్డి

ఆత్మకూరు: పట్టణంలోని నేతాజీ క్లబ్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. నెల్లూరుకు చెందిన డాక్టర్ హేమలతారెడ్డి న్యూరో సర్జన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్యశిబిరంలో 80 మందికి పైగా రోగులను పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. పక్షవాతం, మూర్ఛ, తలనొప్పి, పార్కిన్సన్, నరాల వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందించారు. ఆస్పత్రి సిబ్బంది, జూనియర్ డాక్టర్లు, రోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

బీఎస్ఎన్ఎల్ మూగనోము

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): ప్రభుత్వ టెలికాం రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ పనితీరు పట్ల వినియోగదారులు తీవ్ర అసౌకర్యంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మర్రిపాడు మండలంలోని నందవరం రామానాయుడుపల్లి, రాంపల్లి, డీసీపల్లి, ఖాన్‌సాహెబ్‌పేట, తదితర గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయిన ప్రతిసారి బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ కూడా స్తంభించిపోతుండడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రైవేట్ నెట్‌వర్క్‌లు పోటీలు పడి మరీ ఆఫర్లను ప్రకటించడంతో పాటు నాణ్యమైన ఫోన్ సిగ్నల్స్, నెట్ డేటా సరసమైన ధరలకు అందిస్తుండగా బీఎస్ఎన్ఎల్ ప్రతినిత్యం సిగ్నల్స్ ఆగిపోయి పడరాని పాట్లు పడుతున్నామని వినియోగదారులు వాపోతున్నారు.

అందరివాడు అలఘునాథుడు

- వెయ్యేళ్ల నాటి పురాతన ఆలయం
- నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

ఆత్మకూరు: పట్టణంలోని తూర్పువీధిలో కొలువై ఉన్న వెయ్యేళ్ల నాటి పురాతన శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథస్వామి ఆలయంలో రెండు రోజుల పాటు అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. దశాబ్దకాలం క్రితం పురావస్తుశాఖ సహకారంతో అనేక మంది దాతల విరాళాలతో పునః నిర్మింపబడిన ఈ ఆలయంలో కొలువైన అలఘునాథుడు భక్తుల కోర్కెలు తీర్చే కల్పతరువు. సోమవారం నుంచి ఉత్సవాలు నిర్వహించనున్నారు.

పురాతన ఆలయం చరిత్ర

ఈ ఆలయం 1247లో తెలుగు చోళుల్లోని మనుమసిద్ధి మహారాజు కాలంలో ఆయన అల్లుడు అల్లు తిరుకాల దేవమహారాజు నిర్మించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. మూడో కుళోత్తుంగ చోళ చక్రవర్తికి సామంతరాజు అయిన తిరుకాళతి దేవమహారాజు క్రీస్తు శకం 1209 నుంచి 1248 వరకు కంచి రాజధానిగా ఈ ప్రాంతాన్ని పరిపాలించారు. ఆయన కుమారుడు మనుమసిద్ధి మహారాజును, తన అల్లుడు అల్లు తిరుకాల దేవరాజు (ఆలయం నిర్మించిన రాజు)ను అంత్య దశలో రాజ్య పాలనకు తనకు సహాయంగా తన వద్ద ఉంచుకున్నాడు. ఆ తర్వాత రాజ్యాన్ని విభజించి మనుమసిద్ధి మహారాజుకు సింహపురి (నెల్లూరు)ని అప్పగించారు. వారిని తెలుగు చోళులుగా పిలవడం పరిపాటి. ఈ క్రమంలో అల్లు తిరుకాల దేవ మహారాజు ఆత్మకూరు ప్రాంతంలో తిరుగుతూ తమ పెద్దల పేరిట గ్రామంలో తూర్పువీధిలో శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథస్వామి ఆలయాన్ని 1247వ సంవత్సరం భాద్రపద మాసం శుక్లపక్షం ఏకాదశి రోజున విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. అప్పట్లో ఆలయాన్ని మూడు అంతస్తుల విమాన గోపురం, లోపల అర్ధ మండపం, ఊయల మండపం, 4 స్తంభాలతో అంతర మండపం, 12 స్తంభాలతో ముఖ మండపం, అద్భుత శిల్ప కళతో మలిచి ఆలయాన్ని నిర్మించారు. జయ విజయల విగ్రహాలను గర్భగుడికి ముందు వైపు ఏర్పాటు చేశారు. అలఘునాథ స్వామి మూలవిరాట్టులను పశ్చిమాభిముఖంగా నిర్మించడం విశేషం. ఆలయ పోషణ కోసం అప్పట్లో నూరు ఎకరాల మాన్యాన్ని ఏర్పాటు చేశారు. కాలక్రమేణ అవి అన్యాక్రాంతం అవ్వడం, ఆలయం సైతం శిథిలావస్థకు చేరింది. ఈ క్రమంలో 1543 సంవత్సరంలో విజయనగర సామ్రాజ్య రాజు కృష్ణదేవరాయల కాలంలో దండ నాయకుడిగా వ్యవహరించిన కోనేటి తిమ్మరాజయ్య ఈ ప్రాంతాన్ని సందర్శించినప్పుడు ఆలయ పరిస్థితిని చూసి కొంత మేర పునఃనిర్మించారు. తిమ్మరాజయ్య ఆంజనేయస్వామి భక్తుడు కావడంతో గర్భాలయం ముందర ఉత్తరాభిముఖంగా అభయాంజనేయ



పునఃనిర్మాణం చేసిన అలఘునాథ స్వామి ఆలయం

స్వామిని ప్రతిష్ఠించాడు. యుద్ధాలులేని సమయంలో సైనికులతో ఆలయానికి ఎదురుగా ఆత్మకూరు గ్రామానికి పడమర వైపున చెరువును తవ్వించాడు. ఇప్పటికీ ఆ చెరువును తిమ్మప్ప చెరువు అని పిలుస్తారు.

పునఃనిర్మాణం

2006లో విజయదశమి రోజున గ్రామ పెద్దలు పలువురు పురాతన ఆలయాన్ని శుభ్రపరిచి సంప్రోక్షణ చేసి తిరిగి పూజలు ప్రారంభించారు. 2009లో అప్పటి ప్రభుత్వ కాలంలో ఈ ఆలయాన్ని ప్రాచీన కట్టడంగా గుర్తిస్తూ పురావస్తు శాఖకు అప్పగించారు. అనంతరం పలువురు దాతల సహకారం ప్రభుత్వం ద్వారా పురావస్తుశాఖ మంజూరు చేయించిన రూ.33 లక్షలతో కలిపి మొత్తం రూ.కోటి వ్యయంతో ఆలయాన్ని 2013లో పునఃనిర్మించారు. అదే ఏడాది ఆగస్టు శ్రావణ మాసంలో నూతన మూలవిరాట్‌ను తిరుమల తిరుపతి దేవస్థానం అందజేయగా శుభ ముహూర్తంలో శ్రీశ్రీ పరిపూర్ణానంద స్వామి, శ్రీ చిన్నజీయర్‌స్వామి సువర్ణ హస్తాల మీదుగా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. అప్పటి నుంచి దశాబ్దకాలంగా ప్రతి నిత్యం నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. ప్రతి నెలా శ్రవణా నక్షత్రం రోజున స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రతి శుక్రవారం మహిళలు విష్ణు సహస్రనామం, లలితా సహస్రనామాలు పారాయణం చేయడం కొనసాగుతోంది.

యజ్ఞోపవీతంలా కాలనాగు

ఆలయ పునఃనిర్మాణంలో భాగంగా 2012లో పనులు జరుగుతుండగా గర్భగుడిలోని మూలవిరాట్టులను బాలాలయం (తాత్కాలిక ఆలయం) లో ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఓ రోజు ఓ నాగుపాము అలఘునాథ స్వామి మూలవిరాట్టుకు యజ్ఞోపవితంలా (జంధ్యం) చుట్టుకుంది. ఎంత పూజలు చేస్తున్నా కదలక మెదలక అలానే ఉండిపోయింది. అనంతరం అది ఆలయంలోని పలు ప్రాంతాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా సంచరిస్తుండేది. 108



టీటీడీ వారు అందజేసిన శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథ స్వామి మూలవిరాట్టులు

రోజుల అనంతరం ఆ నాగుపాము స్వామివారి పాదాల చెంతనే ప్రాణాలు కోల్పోయింది. దీంతో పలువురు అర్చకుల సూచనల మేరకు ఆలయ ప్రాంగణంలో నాగార్పమ్మ గుడిని ఏర్పాటు చేశారు. ఇప్పటికీ ఆ గుడిలో విశేష పూజలు, మంగళ, ఆదివారాల్లో పాలాభిషేకాలు నిర్వహించడం విశేషం.

రెండు రోజుల పాటు ఉత్సవాలు రేపటి నుంచి

ఆలయానికి గతంలో ఉన్న మాన్యాలు ఆస్తులు అన్యాక్రాంతం కావడంతో నిర్వహణ భారంగా ఉండడంతో ఏటా రెండు రోజులు మాత్రమే బ్రహ్మోత్సవాలు జరిగేలా పలువురు పెద్దలు పరిపూర్ణానంద స్వామి సలహాతో నిర్ణయించారు. దశాబ్దకాలంగా వైశాఖ మాసంలో ఏకాదశి రోజు స్వామి వారి కల్యాణం, అనంతరం మరుసటి రోజు గజ వాహనంపై గ్రామోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా నిర్వహించడం కొనసాగుతోంది. సోమవారం స్వామి కల్యాణం ప్రత్యేక వేదికపై తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకులు నిర్వహించనున్నారు. మంగళవారం రాత్రి గజవాహనంపై గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి రూ. 5 లక్షల విరాళం

కలిగిరి: మండలంలోని కమ్మవారిపాళెంలో నూతనంగా నిర్మిస్తున్న కోదండరామస్వామి దేవస్థానం నిర్మాణానికి ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు రూ. 5 లక్షల విరాళాన్ని ఆలయ ధర్మకర్త కాట్రగుంట వెంకటసుబ్బయ్యకు ఆదివారం అందజేశారు. ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామన్నారు.



ఆలయ ధర్మకర్త వెంకట సుబ్బయ్యకు రూ.5 లక్షల విరాళం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లినేని

ఘనంగా ఆరాధన మహోత్సవాలు



కృష్ణారెడ్డిపాళెంలో ప్రత్యేక అలంకరణలో వీరబ్రహ్మేంద్రస్వామి

కలిగిరి: కలిగిరి పంచాయతీ జిర్రావారిపాళెంలోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆరాధన మహోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కృష్ణారెడ్డిపాళెంలో నూతనంగా నిర్మించిన శ్రీపోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బ్రహ్మంగారి మఠం నుంచి వచ్చిన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ అన్నదాన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.



విశేష అలంకారంలో బ్రహ్మంగారు

బ్రహ్మంగారి ఆరాధన

సంగం: సంగంలోని బ్రహ్మంగారి మందిరంలో ఆరాధన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని పరిమళ పుష్పాలతో అలంకరించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

తెల్లరాయి అక్రమ తవ్వకాలపై దాడులు

- పలు వాహనాలు స్వాధీనం

వరికుంటపాడు: మండలంలోని గువ్వాడి అటవీ ప్రాంతంలో అక్రమంగా జరుగుతున్న తెల్లరాయి తవ్వకాలపై అటవీ శాఖాధికారులు దాడులు శనివారం అర్ధరాత్రి జరిపి పలు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం ఉదయగిరి అటవీ రేంజ్ అధికారి తుమ్మల ఉమామహేశ్వరరెడ్డి సమాచారం మేరకు.. గువ్వాడి ఫారెస్ట్‌లో తెల్లరాయి తవ్వకాలు జరుగుతున్నాయని తమకు సమాచారం అందిందన్నారు. తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని తెల్లరాయి తవ్వుతున్న ఇటాచీ 200 ప్రొక్లెయినర్, ఓ కారు, టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేసి ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

విద్యార్థులకు బహుమతులు



బహుమతులతో విద్యార్థులు

చేజర్ల(సోమశిల): అనంతసాగరంలోని ఉర్దూ పాఠశాలలో విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు పాపిశెట్టి నర్సింహులు బహుమతులు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవుల్లో ఇంటి వద్ద ఉండాలని, ఎండలు తీవ్రత దృష్ట్యా బయట తిరగొద్దన్నారు. పాఠశాలలో చేరే విద్యార్థులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం



పుట్టుపల్లిలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చేజర్ల: మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని చేజర్ల మండలంలోని పుట్టుపల్లిలో ఆదివారం నిర్వహించారు. మండల జేసీఎస్ కన్వీనర్ పూనూరు బాలంగాధర్‌రెడ్డి, ఆ గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్ ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. ఇంటింటికి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అంటించారు.

పారిశుధ్యం అస్తవ్యస్థం



మురికినీరు రోడ్డుపై ప్రవహిస్తున్న దృశ్యం


అనుమసముద్రంపేట: మండల కేంద్రం ఏఎస్‌పేటలోని పవిత్ర పుణ్యక్షేత్రం హజరత్ నాయబ్ రసూల్ దర్గా ప్రాంతంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. మురుగునీరు కాలువలు పొంగి రోడ్డుపై ప్రవహిస్తున్నాయి. దీనికి తోడు పందులు హల్‌చల్ చేస్తూ భక్తులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. పంచాయతీ కార్యదర్శికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా కనీసం పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. మురికినీరు రోడ్లపై ప్రవహించడంతో దుర్గంధం వెదజల్లుతుందని స్థానికులు వాపోతున్నారు. జిల్లా అధికారులైనా శ్రద్ధ తీసుకుని ఏఎస్‌పేటలో పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఈ నెల 8 నుంచి సమ్మర్ క్యాంపులు

చేజర్ల(సోమశిల): జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదేశాల మేరకు ఈ నెల 8 నుంచి జూన్ 16వ తేదీ వరకు అనంతసాగరం మండలంలో సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ నారాయణరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు తమ తల్లిదండ్రుల అనుమతితో ఈ సమ్మర్ క్యాంపులో పాల్గొనాలని ఆయన తెలిపారు. ఈ సమ్మర్ క్యాంపు 40 రోజుల పాటు జరుగుతుందని, అందులో ఉద్యోగస్తులు, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మాదక ద్రవ్యాల నిరోధంపై అవగాహన

అల్లూరు: మండలంలోని రాయపేటలో ఆదివారం కోవూరు సెబ్ సీఐ నరహరిరావు ఆధ్వర్యంలో స్థానిక వలంటీర్లు, ,గ్రామ ప్రజలకు మాదక ద్రవ్యాల నిరోధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిషేధిత మత్తు పదార్థాలకు ప్రజలు దూరంగా ఉండే విధంగా వలంటీర్లు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. నిషేధిత మాధక ద్రవ్యాలను విక్రయిస్తుంటే సెబ్ అధికారుల తెలియజేయలన్నారు. మాదకదవ్యాల అమ్మకాలతో పాటు జూదం, కోడిపందాలుపై కూడా టోల్‌ఫ్రీ నంబర్ 14500కు సమాచారం అందించవచ్చన్నారు. మాదకద్రవ్యాల మత్తులో నేరాలు చేసి సమాజంలో నేరస్తులుగా మారవద్దని, డ్రగ్స్ వాడినా, రవాణా చేసినా చట్ట ప్రకారం కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు. యువత ఉన్నత చదువులు చదువుకుని తమ భవిష్యత్తుకు మంచి బాటలు వేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెబ్ సిబ్బంది పాల్, శ్రీనివాస్, రాజు, వలంటీర్లు మమత, రీమ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ నరహరిరావ్

స్టాక్ పాయింట్‌కు చేరిన పాఠ్యపుస్తకాలు


ఉదయగిరి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు మండలంలోని అన్నీ పాఠశాలలకు 2023–24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వం సరఫరా చేయనున్న పాఠ్యపుస్తకాలు అందించేందుకు జగనన్న విద్యాదీవెన కిట్లు స్టాక్ పాయింట్‌కు ఆదివారం చేరుకున్నాయి. ఈ పుస్తకాలను ఎంఈఓ ఆదేశాల మేరకు కార్యాలయ సిబ్బంది స్వాధీనం చేసుకుని సరిచూసుకుని భద్రపరచారు. మండలానికి మొదట విడతగా 11,903 పాఠ్య పుస్తకాలు అందినట్లు ఎంఈఓ తెలిపారు. పుస్తకాలను విద్యార్థులకు పాఠశాలలు పునఃప్రారంభం రోజునే పంపిణీ చేస్తామన్నారు.



పాఠ్య పుస్తకాలు భద్రపరుస్తున్న సిబ్బంది

ధ్యాన, జ్ఞాన మహాయజ్ఞంపై ప్రచారం

ఉదయగిరి: ఈనెల 2 నుంచి 22వ తేదీ వరకు 21 రోజుల పాటు ఉదయగిరిలో జరిగే ధ్యాన, జ్ఞాన మహాయజ్ఞంపై పిరమిడ్ నిర్వాహకులు ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ తో పాటు, వాల్‌పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా మనశ్శాంతి, దీర్ఘాయుషు, సంపూర్ణారోగ్యం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు వెంకటేశ్వర్లు, నారాయణరెడ్డి, తిరుపతిరెడ్డి, హేమలత, రాజేశ్వరి, ఉమా, సుప్రజ, మహేశ్వరీ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీచేస్తున్న దృశ్యం

వరెస్ట్ ఏరియాలు



నారంపేట సమీపంలో జాతీయ రహదారుల శాఖ వారు నిర్మించిన వాహనదారుల విశ్రాంతి భవనం

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా
- నిరుపయోగంగా విశ్రాంతి భవనాలు, సౌకర్యాలు

ఆత్మకూరురూరల్: నేషనల్ హైవే అథారిటీ సంస్థ నిర్లక్ష్యం, పోలీసుల నిఘా వైఫల్యం కారణంగా విశ్రాంతి ఏరియాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. 67వ నంబరు జాతీయ రహదారి సంబంధిత అధికారుల తీవ్ర నిర్లక్ష్యం, నిర్వహణ లోపంతో ప్రాణాంతక ప్రయాణాలకు రహదారిగా మారితే.. రెస్ట్ ఏరియా అంతకు మించి నేరాలకు కేంద్రంగా మారింది. మండలంలోని నారంపేట పారిశ్రామికవాడ, బోయలచిరివెళ్ల క్రాస్ రోడ్ల వద్ద 67వ నంబరు జాతీయ రహదారి పక్కన రెస్ట్ ఏరియాల పేరుతో నిర్మించిన రెస్ట్ ఏరియాలు ఇందుకు సజీవ సాక్ష్యంగా ఉన్నాయి. రెండేళ్లుగా రెండు చోట్ల నిర్మించిన భవనాలు, వాహనదారులకు ఎలాంటి ఉపయోగంగా లేకపోగా ఆకతాయిలు, అసాంఘిక శక్తులకు అడ్డాగా మారి తీవ్రస్థాయిలో దుర్వినియోగం అవుతున్నాయి. విశ్రాంతి భవనాలు సుందరంగా నిర్మించి అందులో తాగునీరు, టాయిలెట్‌లు, ఫ్యాన్లు వంటి సకల సదుపాయాలు ఏర్పాటు చేసినా.. అవి ప్రస్తుతం పట్టించుకునేవారు లేకపోవడంతో శిథిలావస్థకు చేరి చిందరవందరగా తయారయ్యాయి. విచ్చలవిడిగా మందుబాబుల సౌకర్యాలకు కేంద్రాలుగా మారాయి. విశ్రాంతి భవనాల్లోని విద్యుత్ వైర్లు, బల్బులు చోరీకి గురయ్యాయి. రాత్రి వేళల్లో ఈ మార్గంలో ప్రయాణించే ద్విచక్ర వాహనదారులకు విశ్రాంతి కేంద్రాల వద్ద జరిగే గోలను చూసి భయభ్రాంతులకు గురవుతున్నామని బాధితులు వాపోతున్నారు. జాతీయ రహదారి నిర్వహణ కోసం టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ మాత్రం కనీస పాటి బాధ్యత లేకుండా అక్కడక్కడా వంతెనలపై రంగులు పూసి బిల్లులు చేయించుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎన్‌హెచ్ విభాగం అధికారులు కాంట్రాక్టర్‌తో లాలూచీ పడి ఇష్టానుసారం బిల్లులు చేస్తూ తమ వాటా దక్కించుకోవడం కోసం ఉత్సాహం చూపుతున్న జాతీయ రహదారుల శాఖ అధికారులు, ప్రయాణికులు, వాహనదారులు పడే పాట్లు పట్టించుకోకపోవడంపై బాధితులు దుమ్మెత్తి పోస్తున్నారు. కలెక్టర్‌కు ఆధారాలతో వినతి పత్రం సమర్పిస్తామని పలువురు ప్రజాసంఘాల వారు పేర్కొంటున్నారు.



విశ్రాంతి భవనంలో వ్యర్థాలతో నిండిన మరుగుదొడ్లు

నేటి నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు

ఉదయగిరి: అన్నీ యాజమాన్యాల పాఠశాలలకు సోమవారం నుంచి జూన్ 11వ తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటించినట్లు ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు వేసవి సెలవులను విజ్ఞాన దాయకంగా గడిపేందుకు సమ్మర్ యాక్టివిటీస్ నిర్వహిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను దత్తత తీసుకుని వేసవి కార్యక్రమాలు అర్థవంతంగా నిర్వహించి ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకుని ఉపాధ్యాయులు మార్గదర్శకం కావాలన్నారు. తిరిగి పాఠశాలలు జూన్ 12న పునః ప్రారంభమవుతాయన్నారు.

వేసవిలో పాఠశాలలు నిర్వహిస్తే చర్యలు

చేజర్ల(సోమశిల): సోమవారం నుంచి జూన్ 11వ తేదీ వరకు రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వుల మేరకు అనంతసాగరం మండంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు, ప్రైవేట్ పాఠశాలలకు సెలవులు ప్రకటించారని మండల ఎంఈఓ ఎం.బాలకృష్ణారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి సెలవుల్లో ప్రైవేట్ యాజమాన్యాలు క్లాసులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని ఆయన తెలిపారు. జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభమవుతాయని తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ, ఒకరికి గాయాలు

అల్లూరు: ముందు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని వెనుక వైపు నుంచి మరో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఓ వృద్ధురాలికి తీవ్రగాయాలు అయిన ఘటన స్థానిక పోలీస్‌సేషన్ ఎదురుగా ఆదివారం జరిగింది. స్థానికుల సమాచారం మేరకు.. విడవలూరు మండలం రామతీర్థం గ్రామానికి చెందిన ఎం.కామేశరమ్మ తన మనవడితో బైక్‌పై అల్లూరుకు వచ్చిన తిరిగి వెళ్తున్న క్రమంలో పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఓ వ్యక్తి అతిగా మద్యం తాగి వెనుక నుంచి అతి వేగంతో ఢీకొనడంతో వృద్ధురాలు రోడ్డుపై పడిపోయింది. ఆమెను అల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

పౌరహక్కులపై అవగాహన కలిగి ఉండాలి

వరికుంటపాడు: సమాజంలో ప్రతి పౌరుడు పౌరహక్కులపై సరైన అవగాహన కలిగి ఉండాలని వరికుంటపాడు పంచాయతీ సర్పంచ్ కె.దిలీప్‌కుమార్ అన్నారు. ఆదివారం పంచాయతీలోని కనియంపాడు ఎస్సీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు శేషారెడ్డి, మూర్తి, వీఆర్ఏలు హజరత్, భానుచందర్, వలంటీర్లు, కాలనీ వాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.